సాక్షి చిత్తూరు

శనివారం । 14 । జూన్ । 2025



తోతాపురి తిప్పలు!

జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. తోతాపురి విక్రయానికి అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. - 8లో



విమాన ప్రమాద మృతులకు నివాళి

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంపై వైఎస్సార్‌సీపీ చిత్తూరు జిల్లా కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. - 8లో



గజరాజుల విధ్వంసం

పులిచెర్ల మండలంలో ఏనుగులు విధ్వంసం సృష్టిస్తున్నాయి. చేతికొచ్చిన పంటలను సర్వనాశనం చేస్తున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

ఈ తీర్పు జర్నలిస్టులకు వజ్రాయుధం



మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నిజాయితీపరులైన జర్నలిస్టులకు వజ్రాయుధం లాంటిదని మాజీ మంత్రి ఆర్కే.రోజా అన్నారు. కొమ్మినేని అరెస్టు అక్రమమని సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం తేల్చి చెప్పడంపై ఆమె స్పందించారు. ఈ మేరకు ఆమె విలేకరులతో మాట్లాడుతూ కొమ్మినేని తక్షణమే విడుదల చేయాలని ఆదేశాలివ్వడం, ఒక విశ్లేషకుడు చేసిన వ్యాఖ్యలతో ఆయనకు ఎటువంటి సంబంధం లేదని న్యాయస్థానం స్పష్టం చేయడం జర్నలిస్టు విజయమన్నారు. సాక్షి టీవీపై విషప్రచారం చేసిన పచ్చ మీడియాకు చెంపదెబ్బ వంటిదన్నారు. రెడ్ బుక్ రాజకీయాలకు సుప్రీంకోర్టులో గట్టి ఎదురు దెబ్బ తగిలిందన్నారు.

చంద్రబాబు ప్రభుత్వానికి చెంపపెట్టు



సూర్యప్రతాపరెడ్డి

చిత్తూరు అర్బన్ : ఏపీలో భారత రాజ్యాంగం అమలు కావడం లేదు. సగటు పౌరుడు తన భావవ్యక్తీకరణ స్వేచ్ఛగా చెప్పలేని పరిస్థితులు తీసుకొచ్చారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు పార్లమెంట్ లీగల్ విభాగం అధ్యక్షుడు సూర్యప్రతాపరెడ్డి తెలిపారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని అరెస్టే దీనికి నిదర్శన మన్నారు. ఇలాంటి చర్యలపై సుప్రీంకోర్టు గట్టిగా ప్రశ్నించిదని గుర్తుచేశారు. ఇప్పటికైనా రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం కాకుండా అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయాలని కోరారు.

17న ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ ప్రారంభం

చిత్తూరు రూరల్: బంగారుపాళ్యం మండలం, నలగాంపల్లి వద్ద ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ నిర్మాణ పనులు పూర్తయినట్లు డీటీసీ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 17న ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇకపై వాహన ఫిట్‌నెస్ పరీక్షలు అక్కడే జరుగుతాయన్నారు. మాన్యువల్‌గా కార్యాలయంలో ఫిట్‌నెస్ పరీక్షలు జరగవని ఆయన స్పష్టం చేశారు.

జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ బదిలీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ బాలక్రిష్ణను తిరుపతికి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఇక్కడకు గుంటూరులో పని చేస్తున్న లక్ష్మీని నియమించింది. ఈమేరకు ఆమె త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు కార్యాలయ అధికారులు తెలిపారు.

టీచర్ల శిక్షణ వాయిదా వేయండి



రెడ్డిశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ట్రెజరర్

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల శిక్షణా తరగతులు వాయిదా వేయాలని రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 16 నుంచి నిర్వహించనున్న శిక్షణలను వాయిదా వేయాలన్నారు. ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకునేందుకు టీచర్లు కృషి చేస్తున్నారని, ఇలాంటి సమయంలో శిక్షణలు ఇవ్వడం సరికాదని సూచించారు.

ఆరోగ్యం సుస్తీ!



మరమ్మతులకు గురైన 108 వాహనాలు

SAKSHI గ్రౌండ్ రిపోర్ట్ GROUND REPORT

- ఈ ఏడాది ఫ్రిబవరి 3వ తేదీన శ్రీరంగరాజపురం మండలం, పాతపాళ్యం దళితవాడ గ్రామస్తులు 30 మంది ఎట్టేరి గ్రామంలో జరిగే ఓ పెళ్లి కార్యక్రమానికి టాటా ఏసీ వాహనంలో బయలుదేరి వెళ్లారు. మార్గమధ్యంలో మెదవాడ ఎస్టీ కాలనీ వద్ద వాహనం బోల్తాపడి ఓ వ్యక్తి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. 20 మంది గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేందుకు స్థానికులు అష్టకష్టాలు పడ్డారు. అంబులెన్స్ సకాలంలో రాక వైద్యం కోసం నానాతిప్పలు పడ్డారు. పీహెచ్‌సీ వైద్య బృందం ప్రాథమిక వైద్యం అందించింది.
- పాలసముద్రం మండల కేంద్రానికి చెందిన దేవానందంను గతనెల 10వ తేదీన ఇంట్లోనే పాము కాటు వేసింది. బంధువులు పాలసముద్రం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ సిబ్బంది పాము కాటుకు మందులేదని చెప్పడానికి రెండు గంటల సమయం తీసుకుని టీటీ ఇంజక్షన్ ఇచ్చి చిత్తూరుకు రెఫర్‌చేశారు. వెంటనే అతన్ని 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మార్గమధ్యంలోనే దేవానందం మృతి చెందినట్లు జిల్లా ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు.
- ఇవి మచ్చుకు రెండు ఘటనలు మాత్రమే. కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య సేవలు పేదలకు అందని ద్రాక్షలా మారాయి. జబ్బున పడితే ప్రైవేటు ఆస్పత్రులే దిక్కుగా దాపురించాయి. 108, 104 సేవలు గాల్లో దీపంలా మారాయి. ఆరోగ్యశ్రీ సేవలు తూతూమంత్రంగా అందుతున్నాయి. మందులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. పేద రోగులు పడరానిపాట్లు పడాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రభుత్వ వైద్యసేవలపై 'సాక్షి'గ్రౌండ్ రిపోర్టు..

ప్రభుత్వ వైద్యానికి చంద్రగ్రహణం

- పల్లెల్లో పడకేసిన వైద్యసేవలు
- అవస్థల్లో పేద రోగులు
- పట్టించుకోని కూటమి నేతలు
- గత ప్రభుత్వంలో ఇంటిముంగిటకే వైద్యం

కాణిపాకం: జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. రక్తపరీక్షలు సరిగా జరగడం లేదు. ఎమర్జెన్సీ మందులు లేవని సిబ్బంది గగ్గోలు పెడుతున్నారు. చిన్నారులకు ఇచ్చే టీకాలు కూడా సరిగా సరఫరా కావడం లేదని చెబుతున్నారు. డాక్టర్ల కొరత వేధిస్తోంది. పీహెచ్‌సీల్లో ఇద్దరు డాక్టర్లు పనిచేయాల్సి ఉండగా.. పలు చోట్ల ఒక్కో డాక్టర్‌తోనే నెట్టుకొస్తున్నారు.

ఆరోగ్యశ్రీ నిర్వీర్యం

2019–24 మధ్య కాలంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఆరోగ్యశ్రీ పథకం కొత్త పుంతలు తొక్కింది. దేశంలోనే ఎక్కడా లేని విధంగా 3,250 ఇబ్బులకు చికిత్స అందించేవారు. అయితే చంద్రబాబు అధ్యక్షతన కూటమి సర్కారు ఏర్పడిన నాటి నుంచి ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారు. నిధులు విడుదల చేయకపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు రెండు మాసాలకోసారి సమ్మెకు దిగుతున్నాయి.

కుయ్యే..మొర్రో అంటున్న 108, 104

ఆపత్కాలంలో ఆదుకునే 108 అంబులెన్సులు నేడు షెడ్డుకు చేరాయి. అంబులెన్సుల నిర్వహణా సంస్థను మార్చారు. పాత వాహనాలన్నీ షెడ్డులో పడ్డాయి. ఫోన్ చేసిన 30 నిమిషాల్లో ఘటనా స్థలికి వెళ్లాల్సిన అంబులెన్సు నేడు గంటకు కూడా రావడం లేదు. కిడ్నీ బాధితులు..డయాలసిస్ కోసం 108 వాహన సేవలను వినియోగించుకునే వారు. కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలల కాలంలో ఈ సేవలకు స్వస్తి పలికారు. ఇక 104 అంబులెన్సులను కూటమి ప్రభుత్వం రాగానే మూలనపడేసింది. గతంలో నేరుగా ఇళ్ల వద్దకే వెళ్లి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులకు మందులివ్వడంతో పాటు వైద్య పరీక్షలు చేసే వారు. కానీ ఇప్పుడాపరిస్థితి లేదు. గతంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ పరుగులు పెట్టేవి. ఇప్పుడు అవి కూడా మూగబోతున్నాయి.

ఆరోగ్య ఆసరాకు ఎసరు

ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్స చేయించుకున్న రోగి కోలుకునే వరకూ వైఎస్సార్ ఆరోగ్య ఆసరాతో గత ప్రభుత్వం జీవన భృతి అందజేసింది. రోజుకు రూ.275 చొప్పున లెక్కగట్టి అందిచేవారు. సాధారణ డెలివరీ, సిజేరియన్లకు రూ.5 వేలు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడి విరిగిన ఎముకల సర్జరీకి రూ.10 వేలు, కాళ్లకు ఇన్‌ఫెక్షన్‌కు సంబంధించి సెల్యులైటీస్ కేసులు, కొన్ని కణుతుల చికిత్సలకు రూ.1,575.. ఇలా చికిత్సను బట్టి సాయాన్ని అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆరోగ్య ఆసరా బిల్లులు చెల్లింపును నిలిపివేయడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.



వేతనాలు రాలేదని నిరసన వ్యక్తం చేస్తున్న 108 సిబ్బంది (ఫైల్)

జీతాల్లేవ్

కూటమి ప్రభుత్వంలో వైద్య సిబ్బందికీ ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో పనిచేస్తున్న డ్రైవర్లకు జీతాలు అందించడంలేదు. టీడీపీ హయాంలో వీరికి నెలకు రూ.7,200 చొప్పున వేతనం చెల్లించేవారు. అదే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దాన్ని రూ.8,800కు పెంచారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడంలేదు. 108 వాహన సిబ్బందికి కూడా సకాలంలో వేతనాలు రాక అవస్థలు పడుతున్నారు.

జిల్లా సమాచారం

జిల్లా ఆస్పత్రి –	1
ఏరియా ఆస్పత్రి –	4
సీహెచ్‌సీ –	8
పీహెచ్‌సీ –	50
అర్బన్ హెల్త్ సెంటర్లు –	15

కంటికి కనిపించని వెలుగు

గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈవి కేంద్రాల ద్వారా జిల్లా ఆస్పత్రి, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల్లో ఉచితంగా కంటి వైద్య సేవలను అందించే ఏర్పాట్లు చేపట్టారు. అవసరమైన వారికి కళ్లజోళ్ల పంపిణీ, శస్త్ర చికిత్సలు చేసేవారు. ఈ కేంద్రాలను నిర్వహిస్తున్న కాంట్రాక్టు సంస్థతో మెమోరాండమ్ ఆఫ్ అండర్ స్టాండింగ్ గడువు గతేడాది ముగియడం.. కూటమి ప్రభుత్వం రెన్యూవల్ చేయకపోవడంతో సేవలు నిలిచిపోయాయి. కంటి పరీక్షల కోసం పేదలు రూ.వేలల్లో వెచ్చించి ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.

108 సేవల వివరాలు

108 వాహనాల సంఖ్య –	33
2024 మూడు నెలల్లో –	12,275 కేసులు
2025 మూడు నెలల్లో –	10,012 కేసులు

ఆరోగ్య శ్రీ వివరాలు.. (2024 మే వరకు)

ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల సంఖ్య

జిల్లా ఆస్పత్రి –	1
సీహెచ్‌సీలు –	5
ప్రైవేటు ఆస్పత్రులు –	12
ఏరియా ఆస్పత్రి –	3
పీహెచ్‌సీలు –	49
వైద్యులు –	49
సిబ్బంది –	246

కార్డుల వివరాలు

డాక్టర్ ఆరోగ్యశ్రీ –	4,96,715
ఎంప్లాయ్‌మెంట్ హెల్త్ స్కీం –	1,935
వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్‌స్కీం –	1,935
అమృత హెల్త్‌స్కీం –	1,044
ఆయుష్మాన్ భారత్ –	1,400

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సర్జరీ వివరాలు

సంవత్సరం	సర్జరీల సంఖ్య	జమ చేసిన మొత్తం రూ.కోట్లల్లో
2019–20	43,898	3.62
2020–21	51,173	90.01
2021–22	75,941	13.99
2022–23	83,816	20.01
2023–24	97,945	24.55
2024–25	131263	25.24

ఆరోగ్య శ్రీ ఆసరా

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	ఖర్చు రూ.కోట్లల్లో
2019–20	5,282	2.95
2020–21	14,439	7.42
2021–22	25,247	11.60
2022–23	22,456	10.41



చిత్తూరు డయాలసిస్ సెంటర్‌లో కిడ్నీ బాధితులు (ఫైల్)



మెదవాడ వద్ద క్షతగాత్రులకు రోడ్డుపైనే చికిత్స అందిస్తున్న వైద్యులు (ఫైల్)

గతంలో ఫోన్ చేస్తే చాలు..



శ్రీరంగరాజుపురం మండలం మెదవాడ వద్ద టాటాఏసీ బోల్తా పడితే అంబులెన్స్‌కు ఫోన్ చేశాం. సమయానికి రాలేదు. ప్రైవేటు వాహనాలు ఆశ్రయించి కొంత మంది క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించాం. మరికొంత మందికి పీహెచ్‌సీ వైద్యులు రోడ్డుపైనే వైద్యం అందించారు. గతంలో ఇలా లేదు. ఫోన్ చేస్తే 108 కుయ్..కుయ్ మంటూ నిమిషాల్లో వచ్చేసేది.

– కరుణకర్, పాతపాళ్యం గ్రామం

వైద్యం అందించే వారే లేరు



గత ప్రభుత్వంలో మా గ్రామంలోకి వచ్చి 104 వాహనం ద్వారా వృద్ధులకు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు చికిత్సలు అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వాహనం వచ్చేది దేవుడెరుగు కనీసం గ్రామాలకు వైద్య సిబ్బంది కూడా రావడంలేదు. ప్రమాద సమయాలలో 108 వాహనం కోసం ఫోన్ చేస్తే ఎప్పుడో స్పందిస్తే ఏం లాభం.

– లక్ష్మీదేవి, చౌడేపల్లి

అరొకర వైద్యం



కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. గతంలో గ్రామానికి వైద్యులు, వైద్య సిబ్బంది ఉదయం వచ్చారంటే మధ్యాహ్నం 2–3 గంటల వరకు ఉండేవారు. కానీ ఇప్పుడు అలా లేదు.

– జ్యోతీశ్వర్,యాదమరి

ప్రైవేటు ఆస్పత్రే దిక్కు



గతంలో ఇంటికాడికి వచ్చి వైద్యం చేసేవారు. మంచిగా చూసి మందులు, మాత్రలు ఇచ్చేవాళ్లు. ఇప్పుడు ఆ విధంగా లేదు. జ్వరం వచ్చినా ప్రైవేటు ఆస్పత్రికి పరుగులు పెడుతున్నాం. పేదలు వైద్యం కోసం వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇది మోయలేని భారంగా మారుతోంది.

– కుమార్, గుడిపాల

వలస జీవులపై మృత్యుపంజా!

వలస జీవులపై మృతువు పంజా విసిరింది. అభంశుభం తెలియని పురిటిబిడ్డను పొట్టనబెట్టుకుంది. మాటలు కూడా రాని మరో చిన్నారిని చిదిమేసింది. కుటుంబానికి ఆదరువుగా ఉంటుందనుకున్న చదువుల తల్లిని దూరం చేసింది. చిన్నాన్న కర్మక్రియలకు వచ్చి వెళ్తున్న ఓ అభాగ్యురాలిని అనంతలోకాలకు పంపేసింది. ఆమె ఇద్దరు బిడ్డలను అనాథలను చేసింది. మరొకరు సొంత పనిమీద బెంగళూరుకు వెళ్తుండగా మార్గమధ్యంలోనే మింగేసింది. గురువారం రాత్రి కర్ణాటకలో జరిగిన ఈ ఘటన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

- కర్ణాటక రాష్ట్రం హోస్కోట వద్ద ఘోర ప్రమాదం
- ఘటనలో ఐదుగురు మృతి
- మృతులు తిరుపతి, చిత్తూరు జిల్లా వాసులు
- కన్నీరుమున్నీరైన కుటుంబీకులు





హోస్కోట్ వద్ద రోడ్డు ప్రమాద దృశ్యం, (ఇన్‌సెట్) రోదిస్తున్న తులసీ తల్లి



మృతి చెందిన చిన్నారి ప్రణతి



మృతి చెందిన తులసి, శారద (ఫైల్)



కేశవులు రెడ్డి, చిన్నారి (ఫైల్)

కార్వేటినగరం: బెంగళూరులో ఉపాధి కోసం వెళుతూ కానరాని లోకాలకు చేరుకున్నారు. మరో 20 నిమిషాల్లోనే గమ్యస్థానానికి చేరుకునే లోపే లారీ రూపంలో మృత్యువు కబళించింది. గాఢ నిద్రలోనే అనంతలోకాలకు పంపేసింది. ఈ విషాద ఘటన కర్ణాటక రాష్ట్రంలోని హోస్కోట వద్ద గురువారం వేకువ జాము 2 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. చిత్తూరు డిపోకు చెందిన బస్సును లారీ ఢీకొట్టడంతో తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన 45 రోజుల చిన్నారితో సహా ఐదుగురు మృత్యువాత పడ్డారు. మరో ఏడుగురు గాయాలపాలయ్యారు. మృతుల్లో గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి చెందిన నలుగురు, తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన ఒకరు ఉన్నారు. స్థానికుల కథనం .. గంగాధరనెల్లూరు మండలం, పాపిరెడ్డిపల్లె పంచాయతీ, మారేడుపల్లె గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి భార్య శారద(40) బెంగళూరులో నివాసముంటోంది. తన చిన్నాన్న కర్మక్రియల కోసం స్వగ్రామానికి వచ్చి తిరుగు ప్రయాణంలో అశువులు బాసింది. అలాగే తూంగుండ్రం గ్రామానికి చెందిన లక్ష్మీకరుణాకర్‌కుమార్ చిత్తూరు డిపో–2లో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సొంత పనిమీద బెంగళూరు వెళ్తూ తీవ్రంగా గాయపడ్డారు. వెదురుకుప్పం మండలంలోని ఆళ్లమడుగు గ్రామానికి చెందిన కే.కేశవులురెడ్డి, అతని తమ్ముడు జానర్ధన్‌రెడ్డి, తల్లి పాపమ్మ, భార్య గిరిజ, ఇద్దరు పిల్లలు కలిసి బెంగళూరులోనే నివాసముంటున్నారు. సొంత పనిమీద స్వగ్రామానికి వచ్చి తిరుగుపయనమయ్యారు. హోస్కోట వద్ద జరిగిన ప్రమాదంలో కేశవులురెడ్డి(45) మృతి చెందగా అతని తమ్ముడు జనార్ధన్‌రెడ్డి కుమారుడు 45 రోజుల చిన్నారి మృత్యువాతపడ్డాడు. మిగిలిన క్షతగాత్రులు హోస్కోట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నచ్చుకూరు గ్రామానికి చెందిన మదన్‌మోహన్‌రెడ్డి, భార్య ధనలక్ష్మి, కుమారుడు జస్వంత్ సొంత పనిమీద బెంగళూరుకు వెళ్తూ గాయపడ్డారు. ఇందులో ధనలక్ష్మికి రెండు కాళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. శ్రీరంగరాజపురం మండలం, కమ్మకండ్రిగ గ్రామానికి చెందిన తులసీ(22) ఉద్యోగాన్వేషణలో భాగంగా బెంగళూరులో శిక్షణ తీసుకుంటూ.. గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో మృతి చెందింది.

'ప్రణతి' రోదన!

అలాగే తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, రామచంద్రాపురం మండలం, తిమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన హరిబాబు, రోహిణి దంపతులు కుమార్తె ప్రణతి(4) మృతి చెందింది. హరిబాబు బెంగళూరులోని ఆర్మీలో పనిచేస్తున్నారు. తన భార్యతో కలిసి స్వగ్రామానికి వచ్చి వెళ్తుండగా ఘటన చోటు చేసుకుంది.

అమ్మానాన్న పిలుపే కరువైంది

గంగాధరనెల్లూరు మండలం, ఆళ్లమడుగు గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. గ్రామానికి చెందిన 45 రోజుల చిన్నారితో సహా వారి పెద్ద నాన్న కేశవులురెడ్డి మృతి చెందారు. ఎన్నో నోములు నోసి.. పుట్టిన పురిటి బిడ్డను ఆ దేవుడు అమ్మానాన్న అని పిలవకముందే దూరం చేశాడంటూ.. ఆ తల్లి గుండెలు బాదుకుంటూ రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

ఆశల దీపం ఆరిపోయింది

కొడుకులు లేరన్న బెంగలేకుండా కుమార్తెను అల్లారుముద్దుగా పెంచి పోషించిన మా ఇంటి దీపం ఆరిపోయిందని మృతురాలు తులసీ తల్లిదండ్రులు విలపించడం కలచివేసింది. ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేసిన తులసీ, ఉద్యోగాన్వేషణలో భాగంగా బెంగళూరు వెళ్లి శిక్షణ తీసుకుంటోంది. హోస్కోట వద్ద జరిగిన ప్రమాదంలో ప్రాణాలు వదిలింది.

చిన్నాన్న కర్మక్రియల కోసం వచ్చి..

జీడీనెల్లూరు మండలం, మారేడుపల్లె గ్రామంలో గురువారం జరిగిన చిన్నాన్న సుబ్రమణ్యంరెడ్డి కర్మక్రియలకు శారద హాజరైంది. తర్వాత బెంగళూరుకు బయలు దేరింది. ఆమె భర్త విశ్వనాథరెడ్డి బెంగళూరులో వ్యాపారం చేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. శారద ఇంట్లో పనులతో పాటు పిల్లల సంరక్షణ చూసుకుంటోంది. హోస్కోట ఘటనలో శారద మృతి చెందడంతో పిల్లలు అనాథలయ్యారు.

స్వగ్రామానికి చేరుకున్న మృతదేహాలు

హోస్కోట ప్రమాదంలో మృతి చెందిన ఆళ్లమడుగు గ్రామానికి చెందన కేశవులురెడ్డి(45), ఆయన తమ్ముడి కుమారుడు 45 రోజుల చిన్నారి మృత దేహాలు శుక్రవారం సాయంత్రం స్వగ్రామానికి చేరుకున్నాయి. చిన్నారిని చూసిన గ్రామస్తులు బరువెక్కిన గుండెతో రోదించారు.

మృతుల కుటుంబాలను ఆదుకోండి

శ్రీరంగరాజపురం : కర్ణాటక రాష్ట్రం, హోస్కోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సాయంగా రూ.50 లక్షలు అందించాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి డిమాండ్ చేశారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. శుక్రవారం పుత్తూరులోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. మృతిచెందిన కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ పార్టీ తరఫున ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

నేడు జిల్లాకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖా మంత్రి అచ్చెంనాయుడు శనివారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం మధ్యాహ్నం 12.45 గంటలకు మంత్రి చిత్తూరుకు విచ్చేస్తారన్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు గుడిపాల మండలం, పల్లూరులో ఫుడ్స్ అండ్ ఇన్స్ మామిడి పండ్ల గుజ్జు పరిశ్రమకు చేరుకుంటారన్నారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు మంగసముద్రం మార్కెట్ యార్డ్ చేరుకుని మామిడి రైతులు, పండ్ల గుజ్జు పరిశ్రమ ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహిస్తారన్నారు. తర్వాత సాయంత్రం 3.30 గంటలకు మంత్రి తిరుమలకు బయలుదేరి వెళ్తారని కలెక్టర్ వెల్లడించారు.

క్లుప్తంగా

గజరాజుల విధ్వంసం

పులిచెర్ల(కల్లూరు): మండలంలో ఏనుగులదాడులు ఆగడం లేదు. శుక్రవారం తెల్లవారుజామున కమ్మపల్లె పంచాయతీకి చెందిన రైతు రవీంద్రనాథరెడ్డి మామిడి తోటను ధ్వంసం చేశాయి. డ్రిప్ పైపులను సైతం తొక్కి నాశనం చేశాయి. దాదాపు నాలుగు టన్నుల కాయలు ఆరగించాయి. పంటకు నష్టపరిహారం చెల్లించాలని రైతు కోరుతున్నాడు.

చిత్తూరులో చైన్ స్నాచింగ్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఓ మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి లాక్కుని పారిపోయాడు. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని కట్టమంచి మల్లికార్జున వీధికి చెందిన స్వర్ణలత ప్రతీ రోజూ పక్కనే ఉన్న చెరువుకట్టపై వాకింగ్ చేస్తుంటారు. శుక్రవారం ఉదయం 5.15 గంటల ప్రాంతంలో చెరువుకట్టపై వాకింగ్ చేస్తుండగా, ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి అడ్రస్ అడిగినట్టు అడుగుతూ.. ఆమె మెడలో ఉన్న దాదాపు 35 గ్రాముల బరువు ఉన్న బంగారు గొలుసును లాక్కుని పారిపోయాడు. మహిళ కేకలు పెట్టినా, చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో దొంగ దొరకలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రిని చంపిన కొడుకు అరెస్ట్

చిత్తూరు అర్బన్: మద్యం మత్తులో తన తల్లిని వేధిస్తున్నాడని తండ్రిని చంపిన కొడుకు సోమశేఖర్‌రెడ్డి (21)ని చిత్తూరు పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం టూటౌన్ ఇన్‌చార్జ్ సీఐ మహేశ్వర వివరాలను వెల్లడించారు. నగరంలోని ఓబనపల్లె లెనిన్ నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ వెంకటరెడ్డి తరచూ మద్యం తాగి వచ్చి తన భార్య సరస్వతిను వేధించేవాడు. ఈ నేపథ్యంలో గురువారం కూడా సరస్వతిని ఇబ్బంది పెడుతుంటే, కుమారుడు సోమశేఖర్ రెడ్డి మందలించాడు. దీంతో కత్తి తీసుకున్న కుమారుడిపై దాడికి ప్రయత్నించగా, అదే కత్తి లాక్కుని వెంకటరెడ్డిను నరికి చంపేశాడు. సరస్వతి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు, సోమశేఖర్‌రెడ్డిని అరెస్టు చేసి, మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచారు. నిందితుడికి 14 రోజుల రిమాండు విధించడంతో, చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



పట్టుబడిన కర్ణాటక మద్యం, నిందితుడు

గుడుపల్లె : కర్ణాట మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 2 కేసుల టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. మండలంలోని కనమనపల్లెకు చెందిన సత్యవేలు శుక్రవారం కెంపాపురం నుంచి గుడుపల్లెకు ద్విచక్ర వాహనంపై కర్ణాటక మద్యం తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

తోతాపురి తిప్పలు!

గిట్టుబాటు కాని ధర

- పలుచోట్ల కిలో రూ.4
- కొన్ని ఫ్యాక్టరీలు మాత్రం రూ.5, రూ.6 ఇస్తున్న వైనం
- ఆరు నెలల తర్వాతే నగదు చెల్లింపు
- టోకన్ల కోసం అవస్థలు
- చోద్యం చూస్తున్న అధికారులు



జీడీనెల్లూరులోని ఓ ఫ్యాక్టరీ వద్ద టోకన్ల కోసం గుమికూడిన జనం

కాణిపాకం: తోతాపురి మామిడి రైతులకు ముచ్చెమటలు పడుతున్నాయి. కాయల విక్రయానికి అవసరమైన టోకెన్ల కోసం పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. కొన్ని ఫ్యాక్టరీలు కాయలు కొనలేమని చేతులెత్తేశాయి. మరికొన్ని ఫ్యాక్టరీలు అధికారుల ఒత్తిడిమీద కొనుగోలు చేస్తున్నాయి. ఈ తరుణంలో మామిడి వ్యాపారులు దండుకునే ప్రయత్నం చేస్తున్నారు. కిలో రూ.4 అని పాట పాడుతున్నారు. ఫ్యాక్టరీలు రూ.5 నుంచి రూ.6 వరకు కొనుగోలు చేస్తున్నాయి. అయితే నగదు చెల్లింపులు ఆరు నెలల తర్వాతేనని తేల్చిచెబుతున్నాయి.

దిగుబడి అధికమే కారణమా?

జిల్లాలో మామిడి సాగు 56 వేల హెక్టార్లలో విస్తరించింది. ఇందులో తోతాపురి 39,895 హెక్టార్ల వరకు ఉండగా.. ఈ సారి 49,9274 వరకు దిగుబడి రావచ్చని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు దిగుబడి కూడా ఆశాజనకంగానే వచ్చింది. దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో రైతులు సంబరపడిపోయారు. తీరా ధరలు పతనమవడంతో డీలాపడ్డారు. టేబుల్ రకాల ధరలు కూడా ఈ సారి ఆశాజనకంగా లేవు.

తోతాపురి రూ.4

జిల్లాలోని ఫ్యాక్టరీ నిర్వాహకులు, వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు తగ్గించేస్తున్నారు. తోతాపురి కేజీ రూ.4కే కొనుగోలు చేస్తున్నారు. దీనిపై వరుసగా ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేయాలని అధికారులు సూచిస్తున్నా పట్టించుకోవడం లేదు. గుడిపాల మండలంలోని ఓ ఫ్యాక్టరీ తొలుత కేజీ రూ.5కే కొనుగోలు చేసింది. అధికారులు ఆ ఫ్యాక్టరీపై ఒత్తిడి తేవడంతో రూ.6కు ఫిక్స్ చేసింది. మిగిలిన ఫ్యాక్టరీలన్నీ అదేబాట పట్టాయి. దీనికితోడు తమిళనాడులోని క్రిష్ణగిరి నుంచి తోతాపురి కాయలను జిల్లాలోని ఫ్యాక్టరీలు అధికంగా దిగుమతి చేసుకుంటున్నాయి. అక్కడ కేజీ రూ.4కే కొనుగోలు చేసి రూ.5కు ఫ్యాక్టరీకి అన్‌లోడ్ చేస్తున్నాయి.

ఆరు నెలల తర్వాతే బిల్లులు

తమిళనాడు నుంచి దిగుమతవుతున్న కాయలకు మాత్రం ఫ్యాక్టరీలు అప్పటికప్పుడు నగదు చెల్లిస్తుండగా.. తెలిసిన వ్యాపారులకు వారం, నెల రోజుల వ్యవధిలో పేమెంట్ చేస్తామని చెబుతున్నాయి. జిల్లాలోని రైతులకు మాత్రం కాయలు తరలించిన ఆరు నెలల తర్వాతే బిల్లులు ఇస్తామని తేల్చిచెబుతున్నాయి.

కూటమి వెన్నుపోటు

మామిడికి గిట్టుబాటు ధర కల్పిస్తున్నట్లు కూటమి ప్రభుత్వం పది రోజుల క్రితమే ప్రకటించింది. ఆ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు గిట్టుబాటు ధర కల్పించిందని సంబరపడిపోయారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఫ్యాక్టరీలు కచ్చితంగా కొనాల్సిందేనని ఊదరగొట్టారు. కొనలేదంటే చర్యలతో పాటు సీజ్ చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. అది కూడా కేజీ రూ.8కే కొనాలని, ప్రోత్సాహక నిధిగా కేజీకి రూ.4 చొప్పున ప్రభుత్వం ఇస్తుందని సంబరాలు చేసుకున్నారు. తీరా చూస్తే వారంలోనే గిట్టుబాటు ధర ఫట్టీ కొట్టింది. ప్రస్తుతం రూ.5, రూ.6కే కొనుగోలు చేస్తున్నారు.

దారుణం



ఇంత దారుణం ఎప్పుడూ లేదు. మామిడి పంట బాగా వచ్చిందని అనుకుంటే ధరలు లేవు. ఫ్యాక్టరీ కాడికి వస్తే కొనే వాళ్లు లేరు. టోకన్లు ఉంటేనే కొనుక్కుంటున్నారు. ఈ బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.

– ఏజాస్, ఆవలకొండ, జీడీనెల్లూరు

ఆరు నెలల తర్వాత బిల్లులా?



కాయలు అమ్ముకోవడానికి టోకన్ల కోసం వచ్చాం. టోకన్లు తీసుకోవడానికి నానా పాట్లు పడుతున్నాం. టోకన్లు ఇవ్వడానికి ముందే ఆరు నెలల తర్వాతే డబ్బులు ఇస్తామంటున్నారు. తోతాపురి రూ.8 అన్నారు. ఇప్పుడు రూ.6 అంటున్నారు.

– బాబునాయుడు, రంగాపురం, జీడీనెల్లూరు

సిఫార్సులకే టోకన్లు

తోతాపురి విక్రయానికి మామిడి రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. టోకన్ల కోసం ఫ్యాక్టరీల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు టోకన్ కోసం నిరీక్షిస్తున్నారు. టోకన్లు జారీచేసే సమయానికి నీకా.. నాకా అంటూ పోటీపడుతున్నారు. కొన్ని టోకన్లు మాత్రమే రైతులకు ఇచ్చినట్టే ఇచ్చి..మిగిలిన టోకన్లు అన్నీ కూడా సిఫార్సుల మేరకు వెళ్లిపోతున్నాయి. కూటమి నేతలు చెప్పిన వాళ్లకే టోకన్లను ఇచ్చుకుంటున్నారు. పూతలపట్టు, చిత్తూరు, గుడిపాల, తవణంపల్లి ప్రాంతాల్లో ఈ రకమైన సమస్యలు అధికంగా ఉన్నట్లు మామిడి రైతులు ఆరోపిస్తున్నారు. జీడీనెల్లూరు మండలంలోని ఓ ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం టోకన్ల కోసం రైతులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. అరుపులు, కేకలతో దద్దరిల్లింది. తోపులాటలు చోటు చేసుకున్నాయి. పోలీసులు సైతం వారిని అదుపు చేయలేకపోయారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంనాయుడు చొరవ తీసుకుని తోతాపురి కేజీ రూ.8కే కొనుగోలు చేయించేయాల చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వయోవృద్ధులను పట్టించుకోకుంటే కేసులే



వృద్ధులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి యం.ఎస్.భారతి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వయోవృద్ధులైన తల్లిదండ్రుల బాగోగులను పట్టించుకోని కుమారుడు, కుమార్తెల నుంచి సెక్షన్ 125 కింద భరణం వసూలు చేయనున్నట్టు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యం.ఎస్. భారతి స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక తపోవనం వద్ద ఉన్న వయోవృద్ధుల ఆశ్రమాన్ని పరిశీలించారు. వారికి చట్టాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ సంపాదించిన ఆస్తిని దానపత్రంతో కొడుకులు, కూతుళ్లకు అప్పగించిన తర్వాత వారు తల్లిదండ్రుల బాగోగులను సరిగా పట్టించుకోవడం లేదన్నారు. ఇలా పట్టించుకోని పక్షంలో 144 కింద కోర్టును ఆశ్రయిస్తే దాన పత్రాన్ని రద్దు చేస్తామన్నారు. ఈ సమస్యపై జిల్లా న్యాయ సేవ అధికార సంస్థలో కేసు వేస్తే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఉచితంగా న్యాయ సేవలు అందిస్తుందన్నారు.

చోరీ కేసులో పురోగతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఇటీవల ఓ బంగారు దుకాణంలో ఆభరణాల చోరీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ప్రధాన నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. వివరాలు.. జెండామాను వీధిలోని ఓ బంగారు దుకాణంలో 180 గ్రాముల నగలు, అయిదున్నర కిలోల వెండి వస్తువులు, పక్కనే ఉన్న స్టీల్ సామాన్ల దుకాణంలో రూ.3.50 లక్షల నగదు చోరీకి గురైన విషయం తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు టెక్నాలజీ వినియోగించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. రెండు రోజుల్లో నిందితుడి అరెస్టు చూపించే అవకాశాలున్నట్లు తెలిసింది.

ప్రశాంతంగా ఎస్జీటీల బదిలీలు



అబ్జర్వర్‌గా విచ్చేసిన ఆర్జేడీకి సమస్యలు విన్నవిస్తున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి చిత్తూరు పరిధిలోని ఎస్జీటీల బదిలీలు శుక్రవారం ప్రశాంతంగా సాగాయి. జిల్లా కేంద్రంలోని షర్మన్ బాలికోన్నత పాఠశాలలో సీరియల్ నం.1001 నుంచి 2000 వరకు ఎస్జీటీల బదిలీల కసరత్తు నిర్వహించారు. వైఎస్సార్ కడప జిల్లా పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ కౌన్సెలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు చిత్తూరు అబ్జర్వర్‌గా విచ్చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం డీఈవో కార్యాలయంలో పలువురు టీచర్ల అర్జీలను స్వీకరించి పరిష్కరించదగ్గ వాటిని పరిష్కరించారు. ఈ కౌన్సెలింగ్ కసరత్తులో చిత్తూరు డీఈవో వరలక్ష్మి, తిరుపతి డీఈవో కేవీఎస్ కుమార్, డీవైఈవోలు పాల్గొన్నారు.

నోషనల్ తేదీ బాధితులు ఫిర్యాదు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2008 డీఎస్సీలో ఉద్యోగాల్లో చేరిన టీచర్లు హామీ పత్రాల ప్రకారం పాఠశాలలో చేరారు. వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించి వేర్వేరు తేదీల్లో పాఠశాలల్లో చేరినప్పటికీ సీనియారిటీ, మానిటరీ బెనిఫిట్స్ అందరికీ ఒకే తేదీ రోజు వర్తించేలా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. సంబంధిత టీచర్లు నోషనల్ తేదీని, పాఠశాలల్లో విధుల్లో చేరిన తేదీని టీఐఎస్ (టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం)లో నమోదు చేశారు. అయితే బదిలీలకు దరఖాస్తు చేసుకునే సమయంలో పాఠశాల విద్యాశాఖ సూచనల ప్రకారం నోషనల్ తేదీ కేవలం ఉద్యోగోన్నతులకు మాత్రమేనని, పాఠశాలల్లో విధుల్లో చేరిన రోజునే బదిలీలకు పరిగణిస్తామని స్పష్టంగా తెలియజేశారు. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయి అధికారులకు సూచనలు సైతం ఇచ్చారు. బదిలీల్లో నోషనల్ తేదీ విషయంలో నష్టపోయిన పలువురు టీచర్లు ఆర్జేడీ శామ్యూల్‌ను కలిసి న్యాయం చేయాలని అర్జీ అందజేశారు.

ఇష్టానుసారంగా దరఖాస్తుల్లో నమోదు

2008 డీఎస్సీ టీచర్లు తమకు ఇష్టానుసారంగా నోషనల్ తేదీని బదిలీల దరఖాస్తుల్లో నమోదు చేసుకున్నారు. మరికొంత మంది పాఠశాలల్లో విధుల్లో చేరిన తేదీని నమోదు చేశారు. ఈ సమస్యపై రాష్ట్ర విద్యాశాఖ అధికారులు పదే పదే స్పష్టమైన ఆదేశాలిచ్చినప్పటికీ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కొంత ఎంఈవోలు అమలులో అలసత్వం వహించారు. దీని వల్ల కొంతమంది టీచర్లు బదిలీల్లో లబ్ధిపొందేందుకు ఉద్దేశపూర్వకంగా నోషనల్ తేదీనే కొనసాగించుకున్నారు. దీంతో నోషనల్ తేదీని నమోదు చేసుకున్న టీచర్లు బదిలీల సీనియారిటీ జాబితాల్లో ముందుకు వెళ్లిపోయారు. నిజంగా పాఠశాలల్లో విధుల్లో చేరిన తేదీని నమోదు చేసుకున్న టీచర్లు జాబితాలో వెనుకకు వచ్చేసి తీవ్రంగా నష్టపోయారు. ఈ సమస్యను డీఈవోకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోని దుస్థితి. సీనియారిటీ జాబితాలో ఇక మార్పులు చేయడం జరగదని డీఈవో స్పష్టం చేశారు. నష్టపోయిన బాధిత 2008 డీఎస్సీ టీచర్ల సమస్యలను ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ ఆర్జేడీ శామ్యూల్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై ప్రత్యేక అధికారితో విచారణ చేయిస్తామని ఆయన బాధితులకు హామీ ఇచ్చారు. ఈ విధంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 150 మంది టీచర్లు లబ్ధిపొందారని ఆర్జేడీకి జాబితా సమర్పించగా, ఆ జాబితా ప్రకారం విచారణకు ఆదేశించారు.

నూతన తహసీల్దార్ల నియామకం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పలు మండలాలకు నూతన తహసీల్దార్లను నియమిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. గంగవరం తహసీల్దార్‌గా మాధవరాజు, సదుం మండలానికి ప్రమీళ, వి.కోటకు ఉదయ్‌సంతోష్, చౌడేపల్లికి పార్వతి, చిత్తూరు అర్బన్ కులశేఖర్, ఐరాల లోకేశ్వరి, రొంపిచెర్లకు అమర్‌నాథ్, వెదురుకుప్పంకు బాబు, చిత్తూరు రూరల్‌కు జయప్రకాష్, చిత్తూరు ఆర్డీవో కార్యాలయం ఏవోగా సీకే శ్రీనివాసులు, కలెక్టరేట్ ఏవోగా వాసుదేవన్‌లను నియమించారు. డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యోగోన్నతి పొంది తిరుపతి నుంచి బదిలీపై చిత్తూరు జిల్లాకు విచ్చేసిన రాజేంద్రకు కలెక్టరేట్‌లోని భూ విభాగంలో ప్రత్యేక తహసీల్దార్‌గా నియమించారు. రేఖకు ఎస్‌ఆర్‌పురం తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇస్తూ డిప్యూటేషన్‌పై కలెక్టరేట్‌లో విధుల్ని కేటాయించారు. జిల్లాలోని వివిధ మండలాల్లో ఇప్పటికే ఎఫ్‌ఏసీ తహసీల్దార్లుగా పనిచేస్తున్న పలువురుకి ఉద్యోగోన్నతి కల్పించారు. యాదమరి మండలానికి పార్థసారథి, పూతలపట్టుకు రమేష్‌బాబు, విజయపురానికి కిరణ్, పులిచెర్లకు జయసింహ, గుడిపాలకు శ్రీనివాసులు, పెనుమూరుకు శ్రావణ్‌కుమార్, కార్వేటినగరానికి నాగరాజు, రామకుప్పంకు కొలేషలను తహసీల్దార్లుగా నియమించారు. నియమితులైన నూతన తహసీల్దార్లు త్వరితగతిన కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి



గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న విజయానందరెడ్డి, నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించారు. ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి నాయకులతో కలిసి గాంధీ విగ్రహం వద్ద ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొవ్వొత్తులు చేతబట్టి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఘటన జరగడం బాధకరమన్నారు. ఎయిర్ ఇండియా విమానంలో ప్రయాణిస్తున్నవారు, మెడికల్ కళాశాలలో ఉన్నవారు 265 మందికి పైగా దుర్మరణం చెందడం దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. అదేవిధంగా కర్ణాటక రాష్ట్రం, హోస్కోట వద్ద జరిగిన ప్రమాదంలో వెదురుకుప్పం మండలంలోని ఆళ్లమడుగు గ్రామానికి చెందిన కేశవులురెడ్డి, కుటుంబ సభ్యులు మృతిచెందడం కలచివేసిందన్నారు. ఈ మేరకు వారికి సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు కేపీ. శ్రీధర్, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి, మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిణిరెడ్డి, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, మాజీ మున్సిపల్ చైర్మన్ సరళమేరీ, ట్రేడ్‌యూనియన్ జిల్లా అధ్యక్షుడు చాన్‌బాషా, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అంజలిరెడ్డి, జెడ్పీటీసీ బాబునాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు అను, రజనీకాంత్, మనోహర్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, ప్రకాష్, కుమార్, త్యాగ, గిరిధర్‌రెడ్డి, స్లాండ్లీ, భాగ్యలక్ష్మి, మధురెడ్డి, లక్ష్మణస్వామి, చల్లాముత్తు, నారాయణ, ఉన్నికృష్ణ, అల్తాఫ్, పూంగొడి, జయగణేష్, కౌసర్, సెల్వ పాల్గొన్నారు.

పిల్లల్ని అపహరించడానికి వచ్చిన వ్యక్తిపై దాడి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని కట్టమంచి వద్ద టమాటాలు విక్రయిస్తున్న వ్యాపారికి, ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన మరో వ్యక్తికి శుక్రవారం గొడవలు జరిగాయి. కట్టమంచి వద్ద టమాటాలు విక్రయిస్తున్న వ్యక్తికి, అటుగా వెళుతున్న ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన మహేంద్రకు చిన్నపాటి వాగ్వాదం జరిగింది. దీంతో టమాటాలు విక్రయించే వ్యక్తి తన స్నేహితులను పిలిపించి మహేంద్రపై దాడి చేయగా, అతను కూడా తిరగబడి దాడి చేశాడు. కొందరు స్థానికులు ఇతడిని వెంబడించగా.. మల్లికార్జున వీధిలోకి వెళ్లి.. అక్కడున్న చిన్నపాపను పట్టుకున్నాడు. పిల్లల్ని కిడ్నాప్ చేస్తున్నాడని భావించి స్థానికులు మహేంద్రను చావబాదారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగా, అప్పటికే మహేంద్రకు రక్త గాయాలయ్యాయి. ఇతడిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడ పెద్ద సంఖ్యలో జనం గుమికూడడంతో భయపడ్డ మహేంద్ర చికిత్సకు నిరాకరించి కుర్చీలు విసిరాడు. వైద్యులు, సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య ఆస్పత్రి వద్దకు చేరుకుని మహేంద్రకు సర్ది చెప్పి వైద్యం చేయించారు. అనంతరం భోజనం పెట్టించి, మహేంద్ర ఛత్తీస్‌ఘడ్‌కు వెళ్లడానికి రైలు టికెట్టు కొనిచ్చి, రైలెక్కించారు.

నాలుగు టిప్పర్ల సీజ్



పోలీస్‌స్టేషన్ వద్ద సీజ్ చేసిన టిప్పర్లు

పాలసముద్రం : మండలంలోని బలిజకండ్రిగ, వనదుర్గాపురం నుంచి అక్రమంగా తమిళనాడుకు మట్టి తరలిస్తున్న టిప్పర్లను తిరుపతి విజిలెన్స్ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. సీఐ రవి మాట్లాడుతూ కొంతకాలంగా ఎలాంటి అనుమతులు లేకుండా సమీపంలోని గుట్టనుంచి ఎర్రమట్టిని తరలిస్తున్నట్లు ఫిర్యాదు అందడంతో దాడులు చేశామన్నారు. ఈ మేరకు నాలుగు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఒక్కో టిప్పర్‌లో 40 టన్నుల మట్టి ఉన్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీలో ఆకలి కేకలు



వంట చేయని దృశ్యం

పాలసముద్రం : మండలంలోని టీవీఎస్‌ఆర్ పురం అంగన్‌వాడీ కేంద్రంలో వంట గ్యాస్ లేదని శుక్రవారం పిల్లలకు భోజనం పెట్టకుండా పస్తులుంచారు. దీనిపై తల్లిదండ్రులు ఆగ్రహించి అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేశారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లు, మధ్యాహ్న భోజనం పెడతారని పిల్లలను పంపించామన్నారు. కూలి పనులకు వెళ్లి వచ్చేసరికి పిల్లలు ఆకలిగా ఉందని, కళ్లు తిరుగుతున్నాయని చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అంగన్‌వాడీ కేంద్రం సిబ్బందిని ప్రశ్నిస్తే గ్యాస్ లేకపోవడంతో ఆహారం తయారు చేయలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 69,609 మంది స్వామిని దర్శించుకున్నారు. 33,144 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.11 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 16 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

విలీనం..వ్యతిరేక స్వరం!



విద్యాశాఖ అధికారులను నిలదీస్తున్న టీడీపీ నేతలు, గ్రామస్తులు

– రోడ్డెక్కుతున్న కూటమి నేతలు

యాదమరి: పాఠశాల విలీనంపై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సొంత పార్టీ నేతలే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మాత్రమే పెదవి విరిచేవారు. ఇప్పుడు సొంత పార్టీ నేతలే ఎదురు తిరుగుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. యాదమరి మండలం, చిన్నంపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో 35 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ చదువుకుంటున్న 3, 4, 5 తరగతులను 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న కీనాటంపల్లి ఆదర్శ పాఠశాలలో విలీనం చేశారు. దీనిపై యాదమరి మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు వినాయకం గౌండర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఉన్నపళంగా లోకజ్ఞానం ఎరుగని పసిబిడ్డలను వేరే పాఠశాలకు పంపాలని ప్రభుత్వ పెద్దలు నిర్ణయించడం సబబుకాదన్నారు. చిన్నంపల్లి నుంచి కీనాటంపల్లి మార్గ మధ్యంలో చెరువులు, వాగులు, బావులు ఉన్నాయని, ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. వీరికి సంఘీభావంగా వచ్చిన వినాయకంగౌండర్ ప్రజలకు ఆమోద యోగ్యం కాని నిర్ణయం తీసుకున్న తమ కూటమి ప్రభుత్వం ఈ విషయంపై పునరాలోచించాలని డిమాండ్ చేశారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలకు అండగా ఉండాల్సిన స్థానిక శాసన సభ్యులు ఈ వ్యవహారంపై నిర్లక్ష్యంగా ఉండడం సమంజసం కాదని హితవు పలికారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంఈఓ రుక్మిణి తెలిపారు. వైఎస్సార్‌సీపీ మాజీ సర్పంచ్ అమలనాథన్ పాల్గొన్నారు.